# నెలరోజుల్లో ఆ సేవకులకు ప్రత్యేక అప్లికేషన్

## -సిఎం ఆదేశాలు...టిటిడి వినూత్న ఆలోచన



తిరుమల, జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి భక్తుల సేవలో తరిస్తున్న శ్రీవారిసేవకుల స్థానంలో నిష్ణాతులైన వారిని రంగంలోకి దించేందుకు టిటిడి ప్రణాళిక రూపొందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల కనుగుణంగా శ్రీవారిసేవను మరింత విస్తృతం చేసే దిశగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వృత్తినిపుణుల సేవలను వినియోగించుకుని భక్తులకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేస్తున్నామని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెల్లడించారు. వృత్తినిపుణులను శ్రీవారిసేవద్వారా టిటిడిలో ముఖ్యమైన 10 విభాగాల్లో వారి సేవలను ఉపయోగించుకునేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మారుతున్న కాలం, అవసరాలు ,అత్యవసర సమయాల్లో కూడా సేవలందించేలా శ్రీవారి సేవకులకు శిక్షణ ఇచ్చి అత్యుత్తమ సేవకులుగా తీర్చిదిద్దాలని అదనపు ఇఒ తెలిపారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# నేడు సిఎం చంద్రబాబు కుప్పం రాక

## - సొంతింట్లో రాత్రి బస .. రేపు శాంతిపురంలో పర్యటన !!



కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు తన సొంత నియోజకవర్గం కుప్పంలో ఒకరోజు పర్యటన నిమిత్తం మంగళవారం సాయంత్రం కుప్పం చేరుకోనున్నారు. బుధవారం శాంతిపురం మండలంలో పర్యటించిన అనంతరం తిరుగుప్రయాణం అవుతారు. సిఎం చంద్రబాబు పర్యటన వివరాలిలా.. జూలై 1వతేది 3.30గంటలకు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి విమానంలో బయలుదేరి బెంగళూరు హెచ్ఎఎల్ ఎయిర్‌పోర్టుకు 4.50గంటలకు చేరుకుం టారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి సాయంత్రం 5.20గంటలకు శాంతిపురం మండలం తుమ్మిశి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి శివపురం వద్ద గల సొంతింటికి చేరుకుని రాత్రి బస చేస్తారు. జూలై 2వతేది ఉదయం 8గంటలకు తిమ్మరాజుపల్లి గ్రామం చేరుకుని అక్కడ 10.45గంటల దాకా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పలు కుటుంబాలతో మాట్లాడతారు. అనంతరం 10.50గంటలకు తులసినాయనపల్లి మోడల్ స్కూల్ వద్దకు చేరుకుని అక్కడ పలు శంకు స్థాపనలు, సంక్షేమ పథకాల్లో అర్హులకు లబ్ధి కలిగించడం, పారిశ్రామికవేత్తలతో ఒప్పం దాలు చేసుకున్న అనంతరం బహిరంగసభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.55నుంచి 2.55వరకు తన నివాసంలో ఉం టారు. మధ్యాహ్నం 3.05గంటలకు కుప్పం ఏరియా ఆస్పత్రికి చేరుకుని టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.20గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని బెంగళూరుకు హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. అక్కడ నుంచి ఉండవల్లి నివాసం చేరుకుంటారు.

### పకడ్బందీ ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్



శాంతిపురం, జూన్ 30 ప్రభాతవార్త సిఎం చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించి పటిష్ట భద్రత చర్యలతో పాటు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శాంతిపురం మండలంలోని తిమ్మరాజుపల్లి, తులసినాయనపల్లిలో సిఎం పర్యటన బుధవారం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. డుంకుమానిపల్లి వద్ద హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సిఎం నివాసం వద్ద గట్టి భద్రత చర్యలకు ఆదేశించారు. తిమ్మరాజుపల్లి గ్రామంలో సిఎం చంద్రబాబు ఇంటింటి పర్యటనకు పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటుతో పాటు పరిసరాల శుభ్రతకు ఆదేశించారు. మోడల్ స్కూల్ వద్ద బహిరంగ సభ ప్రదేశాన్ని, స్టాల్స్ ఏర్పాటును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. కుప్పం ఏరియా ఆస్పత్రిలో డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను సిఎం ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ సైతం పటిష్ట భద్రతకు ఆదేశించారు. కార్యక్రమంలో సిఎంఒ కార్యాలయ అధికారులు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డిపిఒ ప్రభాకర్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, ఎఎస్పీ నందకిషోర్, డిఎస్పీలు రాజనాథ్, సాయినాథ్, ఫైర్ అధికారి పెద్దిరెడ్డి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# గేర్ మార్చుతున్న సిఎం చంద్రబాబు

## ప్రజలతో మమేకం కావాల్సిందేనని ఆదేశాలు !!
## ఉమ్మడి జిల్లాలో సక్రమంగా పనిచేయని ఎమ్మెల్యేల్లో ఆందోళన !!

కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ సంస్థాగత పరంగా గేర్ మార్చుతున్నారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన నేపథ్యంలో తాజాగా రెండు రోజుల క్రితం సిఎం చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. తాను ముందు పనిచేయని వారితో ఎలా వ్యవహరిస్తారో కరాఖండిగా తేల్చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించిన నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్సీలతో పాటు పార్టీ శ్రేణులకు కూడా ఉందని స్పష్టం చేశారు. ఇందులో ఎవర్నీ ఉపేక్షించేది లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు కార్యక్రమానికి కుప్పం నుంచి శ్రీకారం చుట్ట నున్నారు. ప్రతి నియోజకవర్గంలోను ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఏడాది పాలన పూర్తయిన నేపథ్యంలో ఇప్పటికే నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై అంతర్గతంగా నివేదికలు తెప్పించుకున్న సిఎం చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేల పనితీరుపై ఓ అంచనాకు వచ్చారనడంలో సందేహం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పుంగనూరు మినహా మిగతా 12 నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, తిరుపతిలో జనసేన తరపున ఎమ్మెల్యే ఉన్నారు. ఈ నేపథ్యంలో తన సొంత జిల్లాలో పార్టీ వ్యవహారాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న సిఎం చంద్రబాబు ఎమ్మెల్యేలు ప్రజలతో మమేకం కావాలని ఆదేశించారు. ఎవరైనా తన సూచనలు పాటించకుంటే అలాంటి వారిని పక్కన పెడతానని స్పష్టం చేయడంతో జిల్లాలో ఉన్న కొందరు ఎమ్మెల్యేల్లో ఇప్పటికే ఆందోళన మొదలైనట్లు తెలుస్తోంది. కాగా కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ప్రజలకు అందుబాటులో లేరని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ పరంగా నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమం సైతం సక్రమంగా నిర్వహించడం లేదని తెలుస్తోంది. ఈ కార్యక్రమాలను ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌ల అధ్వర్యంలో నిర్వహించడంతో పాటు అదే రోజు కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సాధక బాధలు తెలుసుకోవాల్సి ఉంది. ఈ విషయంగా కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు పట్టీపట్లనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబునాయుడు తగు చర్యలు తీసుకుంటారని పార్టీ కార్యకర్తలు ఆశిస్తున్నారు. ఎమ్మెల్యేలను, పార్టీ ఇన్‌చార్జ్‌లను అటు ప్రజలు, ఇటు కార్యకర్తలకు అందుబాటులో ఉండేలా చూడాలని కార్యకర్తలు కోరతున్నారు.

# పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు మొదటి ప్రాధాన్యత

## - జిల్లా కలెక్టర్



తిరుపతి కలెక్టరేట్, జూన్ 30 ప్రభాతవార్త ః రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంకు మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు సకల సౌకర్యాలు అందజేసి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్ధవంతంగా పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ శుభం బన్సల్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాని, రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్, సుధారాణి, రోజ్‌మాండ్ ప్రజల నుంచి 296 అర్జీలను స్వీకరించారు.

## సవ్యసాచి దివ్యదర్శనం



శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం అరుజ్నుడు దివ్యదర్శనం ఇచ్చారు. మత్స్యయంత్రచ్ఛేదనం కార్యక్రమాల్లో భాగంగా అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను కన్నుల పండువగా ముస్తాబు చేశారు. ఆలయం వద్ద గల అలంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామారావువీధి, తేరువీధి, బజారువీధి, నగరి వీధి, నెహ్రూవీధుల గుండా ఊరేగింపు సాగింది. ఉత్సవంను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఎఇఓ హేమామాలిని పర్యవేక్షించారు. ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య సారధ్యంలో ఉత్సవం సాగింది, పూజారి పురుషోత్తం ఉభయదారులు కెవియస్‌నాయుడు కుటుంబసభ్యులు, గుప్తామెడికల్స్ అధినేత టి.జి ప్రభాకర్ గుప్తా కుటుంబసభ్యులు హాజరయ్యారు.

# శివయ్య పాలకమండలి దాదాపు ఖరారు?!

## రాష్ట్ర వ్యాప్తంగా సభ్యులకు అవకాశం



శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలికి సుముహూర్తం దాదాపు ఖరారు అయ్యిందని సమాచారం అందింది. ఈ మేరకు ప్రమాణ స్వీకారానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఛైర్మెన్‌గా రంగినేని చెంచయ్యనాయుడుకు అవకాశం ఉందని ఆయన అభిమానులు మంగళవారం జరిగే ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుటకు సిద్ధం చేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బోర్డు నియామకానికి సంబంధించి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి జాబితా సిద్ధం చేసి పార్టీ కార్యాలయానికి సమర్పించారు. అయితే వివిధ సమీకరణలు రాష్ట్రంలోని అన్ని దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ళను నియమించాలనే భావంతో సాగదీసారు. ఇలా 14 నెలలు గడిచిపోయింది. అయితే సోమవారం ఇక్కడ అందిన సమాచారం మేరకు మూడు నాలుగురోజుల్లో బోర్డు పగ్గాలు అందిస్తారని సమాచారం. అయితే బోర్డులో 16 మంది సభ్యులుండగా బోర్డులో రాష్ట్రవ్యాప్తంగా సభ్యులకు అవకాశం కల్పించుటకు నిర్ణయించినట్లు సమాచారం. ఇక్కడిబోర్డు ఒక్కటే నామినేషన్ పదవులు అందించుటకు అవకాశం కాబట్టి మొదటి సారి అన్ని పదవులు స్థానికులకే అవకాశం కల్పించాలని పలుమార్లు ఎంఎల్ఏ అధినాయకుల దృష్టికి తెచ్చారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయ ఆదాయం రూ.200కోట్లుదాటటంతో ఇక్కడ బోర్డు లో సభ్యత్వం కోసం పలువురు పోటీలు పడుతున్నారు. దాంతో అధిష్టానానికి కూడా సమస్యగా మారింది. మరో వైపు కూటమి ప్రభుత్వం కాబట్టి బిజెపి, జనసేనలకు అవకాశం కల్పించాల్సి ఉంది. దాంతో అందరిని సంతృప్తి పరచుటకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే స్థానికంగా ఎవరికి అవకాశం వస్తుందో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది.

# ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలుశిక్ష



## ఒకొక్కరికి రూ.6లక్షల జరిమానా తీర్పు వెల్లడించిన ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి

తిరుపతి కార్పొరేషన్, జూన్ 30, ప్రభాతవార్త ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ద తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 27/2016 కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టయ్యారు. వీరు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన జె. దామోదరం, ఏ. హరిప్రసాద్ కాగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ చంద్రగిరి మండలం, పాండురంగవారి పల్లి ప్రాంతంలో పట్టుబడ్డారు. వీరి నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు వీరిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.

# పెద్దశేష వాహనంపై శ్రీనివాసుడు

## ఆగమోక్తంగా సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూలై 30 ప్రభాతవార్త: సర్వాంతర్యామియైన శ్రీనివాసుడు పెద్దశేషవాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సాక్షాత్కార వైభవోత్సవాలను సోమవారం ఆగమోక్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామి వారిని వైకువజామున సుప్రభాతసేవతో మేల్కొలిపి తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, గంధంతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారు తన దేవేరులతో ఆలయ ప్రాంగణంలో ఊంజల్‌పై సేదదీరారు. రాత్రి 7 గంటలకు సర్వాంతర్యామి అయిన శ్రీనివాసుడు పెద్దశేష వాహనంపై విహరిస్తూ లోకరక్షకుడుగా ప్రజల ఈతిబాధలను తొలగించి మోక్షమార్గం ప్రసాధిస్తూ తిరుమాడవీధులలో ఊరేగుతూ భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, డిప్యూటీ ఈఈ (ఎలక్ట్రికల్) భాస్కర్, ఏఈఓ ఎం.గోపినాధ్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, సూపరింటెండెంట్స్ రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు మురళీ, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## సామాన్య భక్తులకు అందుబాటులో

# సామూహిక కళ్యాణ మండపం

## - కాణిపాకం ఆలయ ఇఓ పెంచల కిషోర్



కాణిపాకం. జూన్ 30 ప్రభాతవార్త: కాణిపాకం స్వయంభూ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సామాన్య భక్తులకు సామూహిక కళ్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆలయ ఇఓ పెంచల కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్య ప్రమాణాల దేవుడు వినాయకుడు చెంత గతంలో సామూహిక కళ్యాణ మండపంలో సామాన్య భక్తులు పెద్ద ఎత్తున సామూహిక కళ్యాణాలను నిర్వహించుకునే వారని తెలిపారు. అయితే సామూహిత కళ్యాన మండపంను భక్తుల సౌకర్యార్ధం అన్నదాన భవన్‌గా మార్పు చేస్తుందన్నందున దేవస్థానం టోల్ గేట్ వద్ద వున్న మరగాందిక కళ్యాణ మండపానికి సామూహిక కళ్యాణ మండపంలోనికి సామూహిక కళ్యాణ నిర్వహణను మార్పు చేసినట్లు తెలిసారు. అయితే భక్తుల సౌకర్యాలను దృష్టిలో వుంచుకుని దేవస్థానం ఇఓ కార్యాలయం ప్రక్కన వున్న కళ్యాణ మండపంను సామూహిక కళ్యాణ మండపంగా అన్ని హంగులతో మార్పు చేసి తీర్చి దిద్దినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అకామిడేషన్ ఎఇఓ ఎస్‌వి కృష్ణారెడ్డి, దేవస్థానం స్థానాచార్యులు పణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరు ఇంటి పన్నుల గోల్‌మాల్‌పై

# బిల్‌కలెక్టర్ సస్పెండ్

## అప్పటి ఇవోపై చర్యలు ఉంటాయా! ఉత్తుత్తునే చర్యలు ఉంటాయా!

### 'వార్త'కు స్పందన

తిరుపతి, జూన్30 ప్రభాతవార్త: తిరుచానూరు గ్రామ పంచాయతీ ఇంటి పన్నుల గోల్ మాల్‌లో బిల్ కలెక్టర్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి ఉత్తర్వులు జారీ చేసారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీ తిరుచానూరు. శ్రీవారి పట్టపురాణి వెలసిన తిరుచానూరు గ్రామ పంచాయతీలో టెండర్లు దగ్గర నుంచి, ఇంటి పన్నులు, నీటి కుళాయి కనెక్సన్‌లు, బిల్డింగ్ అప్రూవల్స్, అనాధికారి ఇండ్లకు ఇంటిపన్నులు విధించడం ఇలా ఎన్నో పంచాయతీరాజ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నా....అప్పటి పంచాయతీ కార్యధర్శి, తిరుపతిరూరల్ ఇవో పిఆర్డి మాధురి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని తిరుచానూరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయితీ ఇవో ఏకపక్షంగా వ్యవహరించడం వల్లే ఇంటి పన్నులు ట్రెజరీకి చెల్లించడంలో భారీ అవినీతి జరిగిందని స్థానికులు, పంచాయతీ ఉద్యోగులు చర్చించుకొంటున్నారు. ఇంటిపన్నుల గోల్‌మాల్ పంచాయతీలో ఇవో ప్రమేయం లేకుండా జరిగింధా? ఆమె ప్రమేయంతోనే ఇంటిపన్నులలో అవినీతి, మోసపూరితంగా జరిగిందా! అనే విషయాలపై పూర్తిస్థాయిలో జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాల్సి ఉంది. తిరుచానూరు గ్రామ పంచాయతీలో ప్రతిరోజు రూ.3లక్షల రుపాయాలకు పైగా ఇంటి పన్నులు వసూలు అవుతాయి. ఇంటి పన్నుల వసూలలో దాదాపు 12 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పని చేయగా కేవలం ఒకరు మాత్రమే రెగ్యులర్ బిల్ కలెక్టర్‌గా రమేష్‌నాయుడు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇంటి పన్నులను పారదర్శకంగా డిజిటల్ పేమెంట్ చేయాల్సి ఉండాగ.. బిల్ కలెక్టర్స్ చేతి వాటం ప్రదర్శిస్తూ బైయాండ్ నగదు వసూలు చేసి, సంబంధిత బిల్ కలెక్టర్ రమేష్‌కు అందజేయడంతో ఆ బిల్ కలెక్టర్ చేతివాటం ప్రదర్శించి స్వప్రయోజనాలకు వినియోగించారని సమాచారం. గత ఎడు ఎనిమిది మాసాలలో దాదాపు రూ,40లక్షలకు పైగా ఇంటిపన్నులను బిల్‌కలెక్టర్ స్వాహా చేసేరనే సమాచారం ఉంది. అధికారులు పూర్తి స్థాయిలో సమగ్ర విచారణలో రూ. కేవలం రూ. 22,73,192 లక్షల రుపాయాలు మాత్రమే ఇంటిపన్నులలో అవినీతి జరిగిందని జిల్లా పంచాయతీ అధికారి తెల్చడం విచారకరం. తిరుచానూరు గ్రామ పంచాయతీ రాష్ట్రంలోనే అతిపెద్ద రెవన్యూ గ్రామ పంచాయితీ. జనాభలోను, ఓటర్లులోను, ఆధాయంలోను మేజర్ పంచాయతీ తిరుచానూరు. కానీ ఇక్కడ జరిగే ప్రతిధి అవాంఛనీయమే. టెండర్స్ దగ్గర నుంచి, అప్రూవల్స్, ఇంటిపన్నులు తదితర పన్నులు ట్రెజరీకి చెల్లించడంలో అంతా మోసపూరితమేనని స్వయంగా సంబంధిత అధికారి తెలియజేయడం వెనక అంతర్యం మతలబు ఏమిటో ఉన్నతాధికారులు తెల్చాల్చి ఉంది. ఉన్నతాధికారులు తిరుచానూరు ఇంటి పన్నుల గోల్‌మాల్‌పై పూర్తిస్థాయి సమగ్ర విచారణ జరుపుతారా! లేక విచారణ పేరుతో అంతమోదిస్తారో వేచిచూడాలి. తిరుచానూరు గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులు గోల్‌మాల్‌పై ఉన్నతాధికారులు స్తబ్ధత కూడా అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. కేవలవ బిల్ కలెక్టర్ ప్రమేయం ఉందా! లేక అప్పటి పంచాయతీ ఇవో, గ్రామ సర్పంచ్ సర్పంచ్ హస్తం ఉందా అనే కోణాలలో పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ జరపాల్సి ఉంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆక్రమణ భూములను దేవాదాయశాఖ స్వాధీనం



కాణిపాకం, జూన్ 30 ప్రభాతవార్త:
కాణిపాకం గ్రామ పంచాయతీ పరిధిలోని అగరంపల్లె గ్రామంలోప్రయివేటు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్న దేవాదాయశాఖకు సంభందించిన భూములను సంభందిత శాఖ అధికారులు సోమవారం సర్వే నిర్వహించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలావున్నాయి. అగరంపల్లె గ్రామంలోని శ్రీకృష్ణ భజనమందిరంకు సంభందించిన సర్వేనెంబరు 365, 366 నెంబర్లలోని భూమిని అదే గ్రామానికి చెందిన పి.దొరస్వామి, పి.మధు అనే వ్యక్తులు ఆక్రమించుకుని పెంకుటిల్లు, రేకుల షెడ్డులను నిర్మించుకున్నారు. ఈనేపథ్యంలో గుంటూరు ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు చిత్తూరు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, విద్యుత్, పోలీసుశాఖ అధికారులు ఆక్రమించుకున్న భూముల్లో నిర్మించుకున్న పెంకుటిల్లు, రేకుల షెడ్డులను జెసిబితో తొలగించి భూములను స్వాధీనం చేసుకుని సంభందిత ఆలయ ఈఓకు అప్పగించారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ గ్రూప్ టెంపుల్స్ ఈఓలు తిమ్మారెడ్డి, రమణ, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యంనాయుడులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మె జయప్రదం చేయండి

పాకాల, జూన్ 30, ప్రభాతవార్త



పాకాల గ్రామ పంచాయతీ శానిటేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం మురళి అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు మండల కన్వీనర్ ప్రసాద్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మధుసూదన్ రావు పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధివిధానాల గురించి మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను నాలుగు కోట్లుగా తెస్తున్నారని పని గంటలు ఎనిమిది గంటల పనిని 12 గంటలకు చేస్తున్నారని కార్మికులకు భద్రత కల్పించాలని వేతనాలు పెంచాలని ఈ లేబర్ కోడ్లు కార్పొరేటర్లకు ఉపయోగంగా ఉన్నాయని తెలియపరుస్తూ జూలై 9 వ తేదీ సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ పంచాయతీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట మురళి, నాయకులు, గుణ, జనార్ధన్, మహేశ్వరి పాల్గొన్నారు.

## 16వ రోజు మున్సిపల్ కార్మికుల నిరసన

పుంగనూరు, జూన్ 30, ప్రభాతవార్త



తమ న్యాయబద్ధమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరసనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 16వ రోజు సోమవారం పుంగనూరు పురపాలక కార్యాలయం వద్ద తమ డిమాండ్లను తెలియజేస్తూ ప్ల కార్డులను ప్రదర్శించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని కోరారు.

## మనస్థాపంతో యువతి ఆత్మహత్య

పుంగనూరు, జూన్ 30, ప్రభాతవార్త

పట్టణం సుబేదార్ వీధిలో కాపురం ఉంటున్న లేట్ వలి భాషా, కుమార్తె హసీనా (19) మనస్థాపం చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం తెలిపారు. ఘటన స్థలానికి సీఐ సుబ్బరాయుడు, ఏఎస్ఐ అస్వత, నారాయణ చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవ పంచనామ నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

పుంగనూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త

ప్రభుత్వం ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దీనిపై ప్రత్యేక కార్యాచరణ ఉంటుందని తాసిల్దార్ రాము అన్నారు. సోమవారం జరిగిన ఎస్సీ ఎస్టీ మార్ట్ ఇన్ కమిటీ సమావేశంలో ఆయన దళిత నేతలు అశోక్ నరసింహులుకు సమాధానం ఇస్తూ ప్రభుత్వ రెవెన్యూ చర్యలలో భూముల సంరక్షణ ఒక భాగమని గుర్తు చేశారు. ఈ సమావేశంలో దళిత నేత యమలా సుదర్శన్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల కోసం మౌలిక సదుపాయాలు స్మశానాల ఏర్పాటు, అనాధీన భూములపై ఇండ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉన్నందున మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ మహేష్, సిఐ సుబ్బరాయుడు మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌గా సునీల్ కుమార్ రెడ్డి

సదుం, జూన్ 30, ప్రభాతవార్త



సదుం మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా 79 ఏ చింతమకులపల్లికి చెందిన సునీల్ కుమార్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది సోమవారం ఈ మేరకు ఆయన తెలియజేశారు. ఆయన తెలుగుదేశం పార్టీ నుంచి క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తున్నారు. గతంలో వాటర్ షెడ్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన సేవకు మెచ్చి తెలుగుదేశం పార్టీ అధిష్టానం పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లా రామ చంద్రారెడ్డి ఆయనకు ఈ పదవిని కట్టబెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ రెడ్డిని తెలుగుదేశం పార్టీ నాయకులు అభినందించారు.

## తెదేపా క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు.. కో ఇన్‌చార్జ్‌లు వీరే !!



కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 12 క్లస్టర్లకు ఇన్‌చార్జ్‌లు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ఎన్నికయ్యారు. కెనమాకుపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా రాజేంద్ర, కో ఇన్‌చార్జ్‌గా రూప ఎన్నికయ్యారు. అలాగే రాళ్లబూదుగూరుకు నాగరాజు, వాజిద్, రామకుప్పంకు రవిరెడ్డి, నవీన్, విజలాపురంకు నాగభూషణం, కామరాజునాయక్, శెట్టిపల్లికి బాలాజీ, బాలు, గుడుపల్లెకు బేటప్పనాయుడు, చలపతి, కంగుందికి హైదర్‌వలీ, గాయత్రి, మల్లానూరుకు చంద్రశేఖర్, విభూషణ్, వెందుగంపల్లికి శ్రీనివాసులు, వేడి, లక్ష్మీపురంకు రోహిత్, వినోద్, డికెపల్లి క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా కన్నన్, కో ఇన్‌చార్జ్‌గా తిరుమగళ్, కుప్పం టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌గా సోమశేఖర్, కో ఇన్‌చార్జ్‌గా శ్యామసుందర్‌ను ఎన్నుకున్నారు.

## చిత్తూరు కోర్టుకు హాజరైన తెదేపా నేతలు

కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు తెదేపా నేతలు సోమవారం చిత్తూరు కోర్టుకు వాయిదా నిమిత్తం హాజరయ్యారు. గత వైకాపా పాలనలో నమోదైన కేసుకు సంబంధించి వీరు న్యాయవాది చంద్రశేఖర్‌తో కలసి కోర్టుకు హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, నేతలు మునస్వామి, సత్యేంద్రశేఖర్, జాకీర్, మంజు, మణి, అప్పు, మునెప్ప, ఉదయ్, పత్ర నారాయణ, మణి,జయశంకర్ ఉన్నారు.

## కుప్పం బిజెపి ఇన్‌చార్జ్‌గా తులసినాథ్



కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జ్‌గా కుప్పంకు చెందిన తులసినాథ్‌ను నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు జగదీష్‌నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పంలో పార్టీ సంస్థాగత వ్యవహారాలు, కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలు తులసినాథ్‌కు అప్పగించినట్లు తెలిపారు. కూటమి కార్యక్రమాలకు బిజెపి తరపున తులసినాథ్‌కు తెలియజేయాలని కోరారు.

## విద్యార్థులకు విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ



కుప్పంరూరల్, జూన్ 30 ప్రభాతవార్త

మండలంలోని చెక్కునత్తం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం తరపున విద్యార్థిమిత్ర కిట్లను సోమవారం యూనిట్ ఇన్‌చార్జ్ కనకరాజు, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు బీరప్ప పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదు వుకుని ఉన్నత సా ్థయికి ఎదగాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు తల్లికి వ oదనం అమలు చేశారన్నారు. కార్యక్రమంలో నేతలు బాలు, చంద్రబాబు, తిమ్మప్ప, మాదేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుప్పంలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు పోలీస్ మోటార్ బైక్



కుప్పం, జూన్ 30 ప్రభాతవార్త

కుప్పం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు గాను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు మోటార్ బైక్ వాహనాన్ని అందించారని కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. ఈ బైక్‌లో పోలీసు సిబ్బంది సంచరిస్తూ ఎక్కడిక్కడ రద్దీ ఉన్న ప్రాంతాల్లో మైక్ ద్వారా ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే మహిళల పట్ల ఏదైనా నేరాలు జరుగుతుంటే త్వరితగతిన చేరుకునేందుకు డయల్ 112 మరియు 100 కాల్స్ రిసీవ్ చేసుకుని సంఘటనా ప్రాంతానికి సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందన్నారు.

## మసీదు కమిటీ అధ్యక్షుడిగా మహబూబ్ బాషా



పెనుమూరు, జూన్ 30 ప్రభాతవార్త:

పెనుమూరు నూరని మసీదు కమిటీ అధ్యక్షుడిగా ఎస్.మహబూబ్ భాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మసీదులో మసీదు కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కమిటీ ప్రధాన కార్యదర్శిగా సిరాజ్ భాషా, కోశాధికారిగా అల్తాఫ్ హుస్సేన్, కమిటీ సభ్యులుగా మున్నాఖాన్, మహ్మద్ రఫీ, దావూద్ భాషా, ఎస్‌జి క్రియా భాషా, షంషీర్, ఇంమ్రాన్ నవసద్, గఫార్ అహ్మద్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన మహబూబ్ భాషా మాట్లాడుతూ మసీదు అభివృద్ధికి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



బంగారుపాళ్యం, జూన్ 30 ప్రభాతవార్త:

చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి శేషాపురం గ్రామ సమీపం వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బెంగళూరు నగరానికి చెందిన జైకిరణ్(30) ద్విచక్రవాహనాంలో చిత్తూరు వైపుకు వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జయకిరణ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. శవపరీక్ష నిమిత్తం మృతదేహంను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఎఎస్ఐ రామచంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

బంగారుపాళ్యం, జూన్ 30 ప్రభాతవార్త: మండలంలోని శేషాపురం హరిజన వాడకు చెందిన రమేష్‌బాబు(45) ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. రమేష్‌బాబుకు మానసిక ఆరోగ్య స్థితి సరిగా లేనందువల్ల ఇష్టానుసారంగా తిరుగుతున్నాడు. గత వారం రోజుల క్రితం ఇంటి నుండి వెళ్ళిన రమేష్ బాబు గ్రామానికి చెందిన ఓ రైతు మామిడి తోటలో చెట్టుకు ఉరి పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం మామిడి తోటలోని కాయలను కోయడానికి వెళ్ళిన కూలీలకు చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతున్న రమేష్‌బాబు మృతదేహం కనబడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం, యువతికి తీవ్రగాయాలు

గంగవరం, జూన్ 30, ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, ఓ యువతి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం అర్ధరాత్రి గంగవరం మండలంలో చోటుచేసుకుంది. గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ కథనం మేరకు.. పలమనేరు పట్టణం ఆర్‌కెస్ట్రీట్‌కు చెందిన మస్తాన్ (50), తిరుపతికి చెందిన రితిక (20) ఇద్దరు ద్విచక్రవాహనంలో వెళుతుండగా విజయవాడవైపు వెళుతున్న కారును వేగంగా ఢీకొనడంతో ఈ నప్రమాదం సంభవించింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దారి కోసం ధర్నా..సిఐ చోరవతో సమస్య పరిష్కారం..!



గంగవరం,జూన్ 30 ,ప్రభాతవార్త :

తరతరాలుగా తమ గ్రామాలకు వెళ్ళె రహదారిని కొందరు రైతులు కబ్జా చేశారంటూ రెండు గ్రామాలకు చెందిన గ్రామస్తులు సోమవారం ఉదయం దారి సమస్య పరిష్కారించాలంటూ రహదారిపై బైటాయించి ధర్నా చేపట్టారు.గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా..మండలంలోని మేలుమాయి పంచాయతీ పరిధిలోని కొత్తూరు,గుండ్లపల్లె గ్రామాలకు తరతరాలుగా వెళ్తున్న రహదారిని మేలుమాయి గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు కబ్జా చేసి దారిని యంత్రాల సహాయంతో ద్వంసం చేసి,రాతి కూసాలు నాటడంతో పాటు బండ రాళ్ళతో రహదారిపై అడ్డంగా వేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.దీంతో అత్యవసర వాహనాలైన 108,104,పాలు రవాణా చేయాలన్నా,విద్యార్థులకు,రైతులు పండించిన కూరగాయలను పలమనేరు వ్యవసాయ మార్కెట్‌కు తరలించాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.తమ గ్రామాలకు గతంలో 20 సంవత్సరాలు పాటు ఆర్టీసీ సర్వీసులు కూడా నడిచాయని అలాంటి రహదారి కబ్జాకు గురైందని దారి సమస్యను పరిష్కరించాలంటూ గత ఆరు నెలలుగా స్థానిక తాహశీల్దారు మాదవరాజుకు ఫిర్యాదు చేసిన ఆయన పట్టించుకోలేదంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.దీంతో దారి సమస్య పరిష్కరించాలంటూ రెండు గ్రామాలకు చెందిన గ్రామస్తులు మేలుమాయి గ్రామానికి వెళ్ళె రహదారిపై బైటాయించి ఆందోళన వ్యక్తం చేశారు.విషయం తెలుసుకున్న గంగవరం అర్బన్ సిఐ ప్రసాద్ సంఘటన స్థలాన్ని చేరుకుని ఆందోళన కారులకు నచ్చజెప్పి ధర్నాను విరమింప చేసి ఘటన స్థలం వద్దకు రెవెన్యూ అధికాలను పిలిపించి వారితో చర్చించి దారి సమస్యను పరిష్కరించారు.ఆరు నెలలుగా దారి సమస్యతో ఇబ్బందులు పడుతున్న తమ గ్రామాలకు వెళ్ళె దారి సమస్యను పరిష్కరించిన సిఐకు రెండు గ్రామాలకు చెందిన గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సేవలలో పుంగనూరు రోటరీ ఆదర్శనీయం

పుంగనూరు రూరల్, జూన్ 30, ప్రభాతవార్త



దశాబ్దాలు తరబడి విద్య, వైద్య రంగాలలో అవిరళ కృషి చేస్తున్న పుంగనూరు రోటరీ ఆదర్శంగా నిలిచిందని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ సూర్య ప్రకాష్ అభినందించారు. పుంగనూరు రోటరీ క్లబ్‌కి ఇటీవల పలు అవార్డులను జిల్లా శాఖ ప్రకటించింది. అధ్యక్షుడు ఆవుల హరిప్రసాద్ సారథ్యంలో రోటరీ శాఖ పలు విభాగాలలో గుర్తింపు సాధించడం హర్షణీయమని పలు అభివృద్ధి కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్ రెడ్డి, సభ్యులు సిఎస్ రాజారెడ్డి, డాక్టర్ చరణ్, కుమార్, భాస్కర్, జట్టు నానబాల గణేష్, అనిల్, డాక్టర్ హరి గోపాల్, పూల త్యాగరాజు, సత్య చారి సుధాకర్ రెడ్డి, మునిరాజ్, కృష్ణకుమార్, నాగిరెడ్డి గురు రాజారెడ్డి పాల్గొన్నారు.

## పగడాల రమణను అభినందించిన చల్లా



పుంగనూరు జూన్ 30, ప్రభాతవార్త

సింగల్ విండో చైర్మన్‌గా నియామకమైన జిల్లా జనసేన కార్యదర్శి పుంగనూరు జనసేన నాయకుడు పగడాల రమణ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా బాబు అభినందించారు. సోమవారం ఉదయం తనను కలిసిన పగడాల రమణను చల్లా బాబు అభినందిస్తూ నిస్వార్థమైన సేవలందించిన కార్యకర్తలకు నాయకులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని అన్నారు. జనసేన పార్టీ కోసం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన పగడాల రమణను పుంగనూరు సింగిల్ చైర్మెన్‌గా ప్రభుత్వం నియమించడం అభినందనీయమని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు తన పదవి కోసం సిఫార్సు చేసిన చల్లా బాబుకు రమణా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 వినతులు

### కమిషనర్ ఎన్.మౌర్య



తిరుపతి కార్పొరేషన్, జూన్ 30, ప్రభాతవార్త

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 47 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా 16 మంది తమ సమస్యలు తెలుపగా, 31 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. ఎస్టీవీ నగర్ నందు కొత్త కాలువలు, రోడ్లు వేయాలని, 12,13,14 డివిజన్లలో పాడైన భూగర్భ డ్రైనేజీ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని, వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ లు కోరారు. నగరంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని, భవానీ నగర్ నందు, సాయి విష్ణు లే అవుట్ నందు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, సుందరయ్య నగర్ లో డ్రైనేజీ కాలువ తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కపిలతీర్థం పెద్ద కాలువ శుభ్రం చేయించాలని, గాంధీ రోడ్ నందు రోడ్డు తవ్వి వదిలేశారని, చిరు వ్యాపారులు ఆక్రమణ చేసి వ్యాపారులు చేస్తున్నారు పరిష్కరించాలని, భారతి బస్టాండ్ వేలంలో టెండర్ దక్కించుకున్న ఇంకా ఇవ్వలేదని, గొల్లవాని గుంట వద్ద వ్యవసాయ భూములు ముంపుకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని, నూతనంగా అప్గ్రేడ్ చేసిన స్కూళ్ళలో కంటింజెంట్ వర్కర్స్ నియమించాలని, ఫుట్ పాత్ పై విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలని, గొల్లవాని గుంట నందు రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డీసీపీ ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, డి.ఈ.లు, ఏసిపిలు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## గుడిమల్లం అభివృద్ధికి ప్రణాళికలు పెరుగుతున్న భక్తులు : ఇఓ రామచంద్రారెడ్డి



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 30 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గం శైవ దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది.చారిత్రక ప్రసిద్ధిచెందిన గుడిమల్లం ఆలయాభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళుతున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి వివరించారు. సోమవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ రాబోవు రోజుల్లో అమలు చేసే పలు పథకాలకు సంబంధించి వివరించారు.భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

### రహదారితో పెరుగుతున్న భక్తులు,అతిధులు:

గుడిమల్లం ఆలయానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగటానికి కారణం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మహాశివరాత్రి పర్వదినానికి సంబంధించిన అంశాన్ని పరిగణలోకి తీసుకొని పాపానాయుడు పేట నుంచి ఆలయానికి తారు రోడ్డును జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి ఆయన్ను ఒప్పించి చక్కటి రోడ్డును ఏర్పాటు చేసారు.దాంతో ఇక్కడకు రవాణా సదుపాయాలు మెరుగుపడటంతో పర్యాటక శాఖ బస్సులను ప్యాకేజిలుగా ఏర్పాటు చేసి బస్సులను నడుపుతున్నారు.దాంతో ఇక్కడకు స్వదేశస్తులే కాకుండా విదేశీ భక్తుల సంఖ్య కూడా పెరిగింది. అంతేకాక ఈ ఆలయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చేసి ఇంకా అభివృద్ధి పరచుటకు శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సమగ్ర ప్రణాళికలతో ముందుకు వెళుతున్నారు.దాంతో భక్తులు, అతిధులు పెరుగుతున్నారు.

### విరాళాలతో నిత్యాన్నదానం:

గుడిమల్లం ఆలయానికి సంబంధించి ఆలయానికి వచ్చే భక్తులు అతిధుల సంఖ్య పెరుగుతుందని దాంతో ఇక్కడకు వచ్చే భక్తులు విరాళాలను అందిస్తున్నారని ఆ విరాళాలను బ్యాంకులో డిపాజిట్ చేసి వచ్చే భక్తులకు నిత్యాన్న పథకాన్ని నిర్వహిస్తున్నామని ఇఓ రామచంద్రారెడ్డి వివరించారు. స్వల్ప కాలంలో రూ.20లక్షలు విరాళాలు బ్యాంకులో డిపాజిట్ చేసి రోజూ వందమందికి అన్నసత్రాన్ని ఏర్పాటు చేసామన్నారు. గుడిమల్లం ఆలయానికి వివిధ మాన్యాల కింద 18 ఎకరాల భూములున్నాయని వాటిని లీజుకు ఇవ్వబడిందన్నారు. ఇటీవల ఆక్రమణల్లో ఉన్న భూములను గుర్తించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చినట్లు సమాచారం.సర్వే నెంబర్ 14లో 26సెంట్లు లీజుకు ఇచ్చినట్లు సమాచారం.రిజినల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చామన్నారు.కొందరు మాన్యాల భూములను ఆక్రమించుకున్నారని వారికి ఆర్ఓఆర్ యాక్టు ప్రకారం నోటీసులు జారి చేసామన్నారు.

## ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి:పని దినాలు పెంచాలి:

తొట్టంబేడు,జూన్ 30 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలంలో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు ఉండరాదని ముఖ్యంగా గ్రామాల్లో మహిళలకు ఉపాధి కోసం పనులను అప్పగించాలని మండల పార్టీ అధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు కోరారు.నేడు పంచాయతీలో పని దినాలు మేరకు నిర్వహించటం లేదన్నారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలన్నారు. పనులు చేయాలన్నారు. ఒక్కొక్కరికి రూ.307 వస్తుందని ఆ మేరకు పనులు చేయించాలని సూచించారు. సోమవారం పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఎన్ఆర్ఇజిఎస్ అధికారులతో సమీక్షించారు.కూటమి ప్రభుత్వం నిరుపేదల పక్షాన ఉందన్నారు. కాబట్టి అధికారులు ప్రభుత్వ లక్ష్యాలను స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి లక్ష్యసాధనకు సహాకరించాలని కోరారు.ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పనులను ఇవ్వాలని కోరారు.అంతేకాక ప్రజలకు అవగాహన కల్పించుటకు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలన్నారు.జవాబుదారి తనం కోసం ప్రతి పంచాయతీలో చేపట్టే పనులకు సంబంధించి కూలీల వివరాలను బోర్డుల మీద ప్రదర్శించుటకు ఎఎల్‌ఏ సూచించారన్నారు.ఈ మేరకు అమలు చేయాలని మునిరాజానాయుడు సూచించారు. ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో పనులతో పాటు అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు.ఈ సమావేశంలో మునిరాజానాయుడుతో పాటు రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు,మాజీ వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షులు జయచంద్రనాయుడు, చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడు, కమల్, బాలాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఎంపిడిఓ సురేంద్రనాథ్ ఎపిఓ కళ్యాణి,ఎఇఇ కీర్తిరెడ్డిలతో సమన్వయంగా పని చేయాలని నిర్ణయించారు.

# తిరుపతి డివిజన్

## పార్టీలకతీతంగా అభివృద్ధికి సంపూర్ణ సహకారం : ఎంఎల్‌ఏ



చంద్రగిరి, జూన్ 30 ప్రభాతవార్త: పార్టీలకతీతంగా చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంఎల్‌ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిడిఓ వెంకటరత్నం అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారుల నివేధికల సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దడం కూటమి ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటున్నట్లు వివరించారు. పంచాయతీలలో డ్రైనేజీ, వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్, సి.సి.రోడ్లు, నూతన అంగన్‌వాడీ భవనాలు వంటి సమస్యలపై సభ్యులు సాయం కోరగా అన్ని అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని అన్నారు. స్థానిక అక్కగార్ల కాలనీలో మంచినీటి సంప్, పైప్‌లైన్‌ను ఎంఎల్‌ఏ ప్రారంభించడం పట్ల ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే క్రమంలో 3 దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు ప్రస్తుతం గతుకులమయం అయ్యిందనీ, ఆక్రమణలకు గురైనందనీ దీనిపై గతంలో రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు తుడా నిధులకై ప్రతిపాధనలు పంపినట్లు వివరించారు. మారిన కాలానికి అనుగుణంగా అక్కగార్ల కాలనీ, వికలాంగుల కాలనీ, బీడి కాలనీ, జోగల కాలనీలకు 6 మీటర్లు విస్తరణతో రోడ్డు నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఏ ప్రతి పక్ష సభ్యులు, కూటమితో కలసి వస్తే ప్రజలకు నచ్చజెప్పి విస్తరణ తప్పక చేసుకుందామని అన్నారు. ఎంఈఓ-2 భాస్కర్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నుండి ఏ పథకం అందుకోవాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి అవసరం అవసరం అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన సంస్కరణల ఫలితంగా ఆదర్శ పాఠశాలల వివరాలను వెళ్ళడించారు. రెవెనూ పరిధిలో 177 శాశ్మన వాటికలకు భూమి గుర్తించినట్లు తహశీల్దార్ శివరామసుబ్బయ్య వెళ్ళడించారు. ఈ క్రమంలో ఎంఎల్‌ఏ రాష్ట్ర ప్రభుత్వం పి4 విధానాన్ని ప్రవేశపెట్టినట్లు వివరించారు. పి4 విధానం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. త్వరలోనే చంద్రగిరిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పునరుద్ఘాటించారు. హౌసింగ్‌కు సంబంధించి తొండవాడ ఎన్టీఆర్ కాలనీ అభివృద్ధికి ఎంఎల్‌ఏ ప్రత్యేక చొరవకు డిఈ శ్రీరాములు రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో హౌసింగ్ కాలనీలపై మండలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాలిటెక్నికల్ అడ్మిషన్ల కోసం వెబ్ ఆప్షన్ నమోదు

సత్యవేడు, జూన్ 30 ప్రభాతవార్త: సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పాలిటెక్నికల్ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించి పాలిసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వెబ్ ఆప్షన్ నమోదు ప్రారంభమయ్యాయి. సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియను చేపట్టింది. ఇందులో భాగంగా తొలిరోజు ఒకటి నుంచి 50 వేల వరకు ర్యాంకు సాధించిన విద్యార్థులకు వెబ్ ఆప్షన్ నమోదు చేయడానికి అవకాశం కల్పించారు. జూలై 10వ తేదీ నుంచి 14 తేదీ లోపు విద్యార్థులు వారికి కేటాయించిన కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలన్నారు.

## మా బడిని తరలించకండి



సత్యవేడు, జూలై 30 ప్రభాతవార్త: మా బడిలో 3,4,5 తరగతులను యథావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వరయ్యకు సత్యవేడు మండలం పేరడం గ్రామస్తులు పలువురు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో పలువురు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ని కలసి బడిలోని 3,4,5 తరగతులను వేరే స్కూలులో విలీనం చేయడంపై వినతి అందించారు. ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం సమర్పించి గ్రీవెన్స్ రసీదు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చిలకమ్మ, కోకిల, జ్యోతి, బుజ్జమ్మ, భూషణ, రుక్మిణి, విమల, కృష్ణవేణి, జ్ఞానమ్మ, లక్ష్మి, చిత్ర, జయమ్మ, మునస్వామి, శంకరయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ స్టిక్కర్లు ఉంటే చర్యలు తప్పవు : ఎస్ఐ

సత్యవేడు, జూన్ 30 ప్రభాతవార్త: వాహన దారులు వారి వాహనాలపై నకిలీ స్టిక్కర్లు ఉన్నట్లయితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సత్యవేడు ఎస్ఐ రామస్వామి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు స్థానిక సీఐ మురళీనాయుడు సూచనల మేరకు పోలీసులు నకిలీ స్టిక్కర్లపై కొరడా జులుపించారు. ఇందులో భాగంగా సోమవారం సత్యవేడు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద పలు వాహనాలను ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలోపోలీసులు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్, గురవయ్య, తదితరులు ఉన్నారు.

## ఉపాధిలో జరిగే అవినీతిపై... న్యాయ విచారణ జరపాలి



విజయపురం, జూన్ 30 ప్రభాతవార్త: ఉపాధిలో జరిగే అవినీతిపై కేంద్రప్రభుత్వం తక్షణమే న్యాయ విచారణ జరపాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు చిత్తూరు డీఆర్‌వోను కలసి సోమవారం వినతిపత్రం అందించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపు మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, మాజీ మంత్రి రోజా ఆదేశాల మేరకురాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 9 నెలల జీతాలు చెల్లించాలని, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌవర వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ జాయింట్ సెక్రటరీ వాసుదేవరెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు ధనపాల్‌రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, సర్పంచ్ సుధాకర్, నాయకులు నవీన్‌రెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, అరుణాచలం, బాలకృష్ణానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వితరణను సద్వినియోగం చేసుకోవాలి



రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త : దాతలు అందించే వితరణను విద్యాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అల్లూరి హనుమంత నాయుడు అన్నారు. రామచంద్రాపురం మండలం నిలువురాళ్ళు కమ్మపల్లిలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన నెత్తకుప్పం జమునమ్మ నెత్తకుప్పం ప్రశాంత్ 6వేలు విలువజేసే వివిధ రకాల విద్యా సామాగ్రిని వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ పెద్దలు నెత్తకుప్పం శేషాద్రి పిళ్ళై నెత్తకుప్పం గౌరీ నాథ్ పిళ్ళై నెత్తకొప్పం రమణమ్మలను ఆదర్శకంగా తీసుకుని వారి జ్ఞాపకార్థంగా పాఠశాల విద్యార్థులకు తమ శక్తి కొలది విస్తరణ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు విద్య కోసం అందించే ప్రతి పైసా భావితరాల అభివృద్ధికి, ఈ సందర్భంగా గ్రామస్తులు ఐదు కుర్చీలను పాఠశాల అవసరాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె. సుబ్రమణ్యం, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హేమంత్ కుమార్, ఉపాధ్యాయురాలు పరమేశ్వరి, ఇతర ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం రాత్రి రుయా ఆస్పత్రిలో మృతి చెందారు. ఆర్.సి.పురం పోలీసుల సమాచారం మేరకు..40 సంవత్సరాల వయస్సు కలిగిన మగ వ్యక్తిని అనారోగ్య కారణాలతో ఎవరో సి. రామాపురం విల్లాస్ వద్ద ఈ నెల 24వ తేదీ తెల్లవారు జామున రోడ్డు ప్రక్కన వదిలి పెట్టి వెళ్ళారుమృతి చెందిన వ్యక్తిని గుర్తించిన వారు రామచంద్రాపురం పోలీస్ ను సంప్రదించాలని కోరారు. ఫోన్ నెంబరు చంద్రగిరి సీఐ 9000796760, వెంకటేష్ రైటర్ ఆర్.సి పురం 772469646, రాజశేఖర్ కానిస్టేబుల్ 7893030879కు సమాచారం ఇవ్వాలని కోరారు.

## రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో మృతి

పుత్తూరు రూరల్, జూన్ 30 ప్రభాతవార్త: పుత్తూరు మామిడికాయల మార్కెట్‌కి మామిడి కాయలు కొనడానికి వచ్చిన 62ఏళ్ళ వృద్ధురాలు రైల్వేస్టేషన్ ఆవరణలో గుండెపోటుతో కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు నగరినియోజకవర్గంలోని ఏకాంబరకుప్పం ప్రాంతానికి చెందిన మహిళగా గుర్తించారు. ఘటన సమయంలో ఆమెతో పాటు ప్రయాణించిన ఇతరులు స్పందించి సహాయపడేలోపే ఆమె ప్రాణాలు కోల్పోయినట్టు తెలిసింది.

## గ్రూపు రాజకీయాలు మానుకోవాలి : ఎమ్మెల్యే



తిరుపతిరూరల్, జూన్30 ప్రభాతవార్త: గ్రామస్థాయిలో గ్రూపు రాజకీయాలు మానుకొని... కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం రఘనాథ్ రిసార్ట్స్‌లోని టిడిపి కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరు మండలాల అధ్యక్షకార్యధర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి... గత ఐదు సంవత్సరాల పాలనలో చేసిన అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. సంవత్సరకాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నేను మీ కుటుంబంలోని సభ్యుడిగా మసలుతూ...ఎల్లవేళల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేసారు. ఆయా పంచాయతీలలో భూగర్భ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని తెలిపారు.

## పరిమితికి మించి విద్యార్థులను...తీసుకెళుతున్న ఐదు ఆటోలు స్వాధీనం

తిరుపతి,రవాణ జూన్ 30ప్రభాతవార్త : సురక్షితంగా, భద్రంగా స్కూల్ విద్యార్థులను తీసుకెళ్ళడంలో నిబంధనలు పాటించని ఐదు ఆటోలు రవాణా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి జిల్లా రవాణాశాఖ అదికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం విద్యార్థులను తరలిస్తున్న ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. స్కూల్ పిల్లలను తీసుకెళ్ళే ఆటోడ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలని రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశించారు.

## సిల్వర్ మెడల్ సాధించిన వారికి సన్మానం



తిరుపతి క్రీడ, జూన్ 30 ప్రభాతవార్త: జూన్ 15 నుండి 20 వరకు సింగపూర్ లో జరిగిన ఆసియా కప్ స్టేజి 2 ఆర్చరీలో పాల్గొని టీమ్ సిల్వర్ మెడల్ సాధించిన మన నాయుడుపేట తిరుపతి జిల్లా వాస్తవ్యుడు అయిన తిరుమూరు గణేష్ మని రత్నంను నేడు జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువ కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.

## హాథీరాంజీమఠంలో...బంజారాలతో టిటిడి చైర్మన్



తిరుమల, జూన్ 30ప్రభాతవార్తప్రతినిధి: బంజారాల కులగురువు హాథీరాంబావాజీ 596వ జయంతి వేడుకలను తిరుమలలోని హాథీరాంజీమఠంలో "బోగ్‌బండార్"పేరుతో వేడుకగా జరుపుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో తెలుగురాష్ట్రాల నుండి తరలివచ్చిన బంజారాలు పాల్గొన్నారు. బంజారాలు సంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## తుడా ఛైర్మన్ డాలర్ ని సత్కరించిన జడ్పీటీసీ



నారాయణవనం, జూన్ 30 ప్రభాతవార్త : తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జడ్పీటీసీ, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని తుడా కార్యాలయ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గంలో తుడా నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను గురించి దివాకర్‌రెడ్డికి వివరించారు. సత్యవేడు నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేయాడానికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు మాణిక్యంరెడ్డి, నాథమునిరెడ్డి, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు

రేణిగుంట జూన్ 30 ప్రభాతవార్త : రేణిగుంట మండలంలోని స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణా కు చెక్ పెట్టడంపై రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం కార్యాచరణ మొదలెట్టారు. అందులో భాగంగా మండలంలోని పిల్లపాలెం స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తహసిల్దార్తో పాటు రెవెన్యూ బృందం దాడులు చేపట్టడంతో ఇసకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని, కేసులు నమోదు చేయక తప్పదని తహసిల్దార్ హెచ్చరించారు.

## ఏపీ క్వాంటమ్ లీప్ వర్క్ షాపులో వీసీ



తిరుపతి విద్య, జూన్ 30 ప్రభాతవార్త: విజయవాడ హోటల్ నోవోటెల్‌లో నిర్వహించిన ప్రతిష్టాత్మక అమ రావతి క్వాంటమ్ వ్యాలీ వర్క్ షాపులో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీ అప్పారావు పాల్గొన్నారు. అమరావతిని భారతదేశ క్వాంటమ్ వ్యాలీగా తదుపరి తరం క్వాంటమ్ టెక్నాలజీలకు కేంద్రంగా ఉంచాలని లక్ష్యంగా క్వాంటం కంప్యూటింగ్, కంప్యూటర్ సైన్స్, గణితం, భౌతిక శాస్త్రం వంటి కీలక డొమైన్లపై సోమవారం జరిగిన వర్క్ పలు వీసీలు పాల్గొన్నారు. ఈ వర్క్ షాపు లో ఎస్వీయూ నుంచి ఆచార్య సుబ్బారావు, డాక్టర్ ఉషా రాణి, ఆచార్య జయ సుబ్బారెడ్డి, డాక్టర్ హేమలత, రుద్రమదేవి, ఆచార్య అంజన్ బాబు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు ప్రదానం



తిరుపతి విద్య, జూన్ 30 ప్రభాతవార్త: డాక్టర్ అంబేద్కర్ గ్లోబల్ లా ఇన్స్టిట్యూట్ నిర్వహించిన మూట్ కోర్ట్ పోటీలలో విజయం సాధించిన అభ్యర్థులకు బహుమతులు ప్రదానం చేసినట్లు ఆ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి తెలిపారు. మొదటి బహుమతి సాధించిన చిట్యాల సాయి కృష్ణ కౌశిక్, మనీష్ చంద్ర సాయి, యశ్వంత్ కుమార్ రెడ్డి టీంకు పదివేల రూపాయలు నగదును, ద్వితీయ బహుమతి కుమారి మానస, కుమారి మోనిక, కుమారి విద్య శ్రీ జాస్మిన్ కు 5000 రూపాయలు నగదును, ఉత్తమ స్పీకర్ సాయి కృష్ణ కౌశిక్ కు 5000, ఉత్తమ మెమోరియల్‌కు 5000 రూపాయల నగదు గెలు పొందారు. ఉత్తమ పరిశోధకురాలుగా కుమారి దివ్యచందన కు 5000 రూపాయలు నగదును తిప్పారెడ్డి చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయకుమార్ బెహరా, ప్రొఫెసర్స్ జూలీ, రష్మీ , రేఖ, శుభమస్తు పాండా, స్వగతిక, వేద వాణి, మ్యాగ్లిన్ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అకడమిక్ కన్సల్టెంట్లకు అన్యాయం చేయవద్దు

తిరుపతి విద్య, జూన్ 30 ప్రభాతవార్త : ఎస్వీయూను ఎన్నో ఏళ్లుగా నమ్ముకుని పని చేస్తున్న 243 మంది అకడమిక్ కన్సల్టెంట్లకు ఫర్ఫార్మెన్స్ సమీక్ష పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయడం దారుణమని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవ్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి రాజకీయ కుట్రలతో ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సహృదయంతో ఆదుకోవాలని కోరారు.

## ఎస్వీ వైద్య కళాశాలలో రెండవ రోజు రిజిస్ట్రేషన్లు



తిరుపతి హెల్త్, జూన్ 30 ప్రభాతవార్త : తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఏపీ వైద్య మండలి రిజిస్ట్రేషన్ ఆదివారం అర్ధరాత్రి 9 గంటల వరకు ఈ ప్రక్రియ దిగ్విజయంగా కొనసాగిందని, తిరుపతి పరిసరాల ప్రాంతాల డాక్టర్లు విరివిగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని ఏపీ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు తెలిపారు. మొత్తం మీద డాక్టర్లు 650 మంది రిజిస్ట్రేషన్లు, రీ- రిజిస్ట్రేషన్లు, ఎన్ఓసీలు, నూతన రిజిస్ట్రేషన్లు చేసుకున్నారన్నారు. మరిన్ని రోజులు పొడించాలని డాక్టర్ శ్రీహరిని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించి ఈ ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల అధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గణపతి విగ్రహం తొలగింపు పంచనామ



శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న బేరివారి మండపం సమీపంలోని ఆగ్నేయ గణపతి ఆలయ జీర్ణోద్ధారణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సోమవారం నిర్వహించారు. గతంలో ఇక్కడ బాలాలయం ఏర్పాటు చేసారు. సోమవారం ఉదయం ఆలయాధికారులు రాగా విగ్రహాన్ని తొలగించారు. ఆలయ డిఇఇ శ్రీనివాసులురెడ్డి ఆలయ ప్రధా నార్చకులు కరుణాకర్ గురుకుల్ వారి సిబ్బంది రాగా రెవెన్యూ సిబ్బంది, పోలీసు శాఖ నుంచి గంగయ్య, మునస్వామిలు రాగా విగ్రహాన్ని తొలగించారు. విగ్రహం కింద ఏం ఉందో పరిశీలించారు. పంచనామ జరిపారు, వినాయకుని విగ్రహానికి తొలగించి భద్ర పరచారు.

## తొట్టంబేడు తహశీల్దార్‌గా బారతి



తొట్టంబేడు, జూన్ 30 ప్రభాతవార్త : నియోజకవర్గంలోని తొట్టంబేడు మండల తహశీల్దార్‌గా భారతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాల యంలో పని చేసిన ఆమె ఇటీవల సాధారణ బదిలీల్లో తొట్టంబేడు మండలానికి బదిలీ చేసారు. అయితే ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలో భూసమస్యలు ఇబ్బడి ముబ్బడిగా ఉన్నాయి. మహిళా తహశీల్దార్ బాధ్యతలు స్వీకరించిన తరువాత పలువురు నాయకులు కలసి ఆమెకు అభినందించారు.

## మాస్టర్ ధనూష్‌కు డాక్టరేట్



శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలోని పేరెన్నిక గన్న కేష్‌షేటో రియో కరాటే ఇన్స్టిట్యూట్‌కు చెందిన మాస్టర్ ధనూష్‌కు వాషింగ్ టన్ డిజిటల్ యూనివర్సిటి డాక్టరేట్ ప్రకటించారు. మాస్టర్ ధనూష్ 21 సంవత్సరాల సాధనకు గుర్తింపు లభించింది. ఆయన్ను స్థానికులు క్రీడాకారులు అభినందించారు. నేడు డాక్టర్‌రేట్ తనకు డిగ్రీతో పాటు శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి మంచిపేరు అని వివరించారు.

## 5న ఏర్పేడు సర్వసభ్య సమావేశం

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 30 ప్రభాతవార్త: ఏర్పేడు మండల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, జడ్‌పిటిసిల సర్వసభ్యసమావేశం ఈ నెల 5న నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈమేరకు ఎంపిడిఓ సౌభాగ్యం ప్రకటించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని గ్రామాల్లో సమస్యలపై చర్చించాలని ప్రజలకు అవసరమైన అవసరాలపై సమగ్రంగా చర్చించి నివేదికలు తయారు చేయటబడుతుందని వివరించారు.

## విలీనంపై గ్రామస్తుల రుస రుసలు



శ్రీకాళహస్తిరూరల్, జూన్ 30 ప్రభాతవార్త : ఏర్పేడు మండలంలోని పలు పాఠశాలలను విలీనం చేయటంతో గ్రామాల్లో తీవ్ర వ్యతిరేకత చోటు చేసుకుంటుంది. అయితే ఇది ప్రభుత్వ లక్ష్యమని ఇందులో మార్పులుండవని తెలిసినా తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నారు. ప్రజలకు చైతన్య వంతుల్ని చేయటంలో విద్యాశాఖ ఉపాధ్యాయుల వైఫల్యమే నేడు తల్లిదండ్రుల ఆందోళనలకు కారణంగా మారింది. ఈ నేపథ్యంలో సోమవారం అముదూరు గ్రామస్తులు తమ పాఠశాలను రాజుల పాళెం పాఠశాలలో విలీనం చేయటం అలాగే పాగాలి పంగూరులో విలీనం చేయటం, ఎండిపుత్తూరు పాఠశాలను రాజుల కండ్రిగలో విలీనం చేయటంతో ఆయా గ్రామాల్లో ప్రజలు, తల్లిదండ్రులు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ మార్గంలో ఆటోలు కూడా నడవవని విద్యాశాఖాధికారులకు వివరించారు.

## విద్యావ్యవస్థ పటిష్టికరణకు సంస్కరణలు: రంగినేని



తొట్టంబేడు, జూన్ 30 ప్రభాతవార్త : విద్యావ్యవస్థను పటిష్టికరణకు యువ నాయకుడు నారాలోకేష్ ఎన్నో సంస్కరణలు చేపడుతున్నారని మొదట అవి క ష్టంగానే కనబడతాయని అయితే మన పిల్లల భవిష్యత్తుకు ఇది తొలిమెట్టుగా భావించాలని శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు సూచించారు. సోమవారం మండలంలోని గుండెలు గుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా విశేష సేవలం దించిన మల్లెల మస్తాన్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్యఅతిధిగా హాజరైన చెంచయ్యానాయుడు మాట్లాడుతూ సమాజంలో భావి భారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. మస్తాన్‌రావు ఉపాధ్యాయుడుగా ఎక్కడ పని చేసినా మంచి పేరు సంపాదించుకున్నారన్నారు. విద్యాబోధనలోనే కాకుండా జీవితానికి పనికి వచ్చే విద్యను అందించటంలో ఆయన ఎంతో చొరవ చూపారన్నారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువతో సత్కరించారు.

## ఈ దిమ్మెను బాగు చేయండి!



తొట్టంబేడు, జూన్ 30 ప్రభాతవార్త: శ్రీకాళహస్తికి కూత వేటు దూరంలో తొట్టంబేడు మండలం బీడీ కాలనీలో విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలటానికి సిద్ధంగా ఉందన్నారు. అయితే దానిని బాగు చేసే దిక్కులేదన్నారు. దిమ్మె చాలా కాలంగా ధ్వంసమై కూలటానికి సిద్ధంగా ఉంది, అయితే దానిని బాగు చేయటానికి పలుమార్లు విద్యుత్ శాఖ దృష్టికి తెచ్చినా పట్టించుకునే దిక్కులేదన్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## మత్స్యయంత్ర చేధనం: గ్రామోత్సవం



శ్రీకాళహస్తి, జూన్ 30 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి తిరునాళ్ళలో భాగంగా సోమవారం రాత్రి అర్జునుడు మత్స్యయంత్ర ఛేదనంఘట్టం వచ్చింది. ఈమేరకు ఆలయ ఆవరణలో భారత పఠనం చేయటం రంగస్థల నటులచే ప్రదర్శనలు జరిపారు. కాగా తరువాత గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

## మూడు దశాబ్దాల విధినిర్వహణకు విశ్రాంతి



చంద్రగిరి, జూన్ 30 ప్రభాతవార్త: మూడు దశాబ్దాల విధినిర్వహణకు ప్రభుత్వం విశ్రాంతి కల్పించినట్లు సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో అటెండర్‌గా 30 ఏళ్ళ పాటు విధులు నిర్వహించిన ముని రాజమ్మ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందితో పాటు మునిరాజమ్మ బంధుమిత్రులు ఆమెకు ఘన సన్మాన సత్కారాలతో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నశ్రీన్‌బేగం, వార్డు సభ్యురాలు జ్యోతి నజరత్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారాహి అమ్మవారి సేవలో జడ్జీ రామగోపాల్



రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త: రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలోని శ్రీవారాహి అమ్మవారిని సోమవారం తిరుపతి 5వ అధనపు జిల్లా సెషన్స్ జడ్జి రామగోపాల్ దంపతులు దర్శించుకున్నారు. శ్రీశ్వేత వారాహి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పీఠంకు చేరుకున్న ఆయనకు పీఠం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీశ్వేతవారాహిదేవికి, శ్రీమరకత శక్తి కాళీమాతకు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. పీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద మహాభారతి స్వామి, మంత్ర మహేశ్వరి రమ్యానంద భారతి స్వాముల ఆశీర్వాదం పొందారు. పీఠం నిర్వహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## తహశీల్దార్ సేవలు ఎనలేనివి : ఎంఎల్‌ఏ



రామచంద్రాపురం, జూన్ 30 ప్రభాతవార్త: తహశీల్దార్ వెంకటరమణ సేవలు ఎనలేనివని ఎంఎల్‌ఏ పులివర్తి నాని కొనియాడారు. రామచంద్రాపురం తహ శీల్దార్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన తహశీల్దార్‌ను సోమ వారం తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, మాజీ ఎంపిపి తానికొండ కేశవులు నాయుడు, టిడిపి నాయకులు కోరా హరిప్రసాద్, లెక్కల సురేంద్ర నాయుడబు, లెక్కల మహేష్ నాయుడు, జనార్ధన్ చౌదరి, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే రాస్ లక్ష్యం



నారాయణవనం, జూన్ 30 ప్రభాతవార్త : మహిళలు ఆర్థికంగా సమాజాంలో ఎదగాలన్న లక్ష్యంతో రాస్ సేవా స ంస్థ పని చేస్తుందని ఆ సంస్థ జెఎస్ఎస్ డైరెక్టర్ మోహన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ నారాయణ వనంలో జనశిక్ష సంస్థాన్ మరియు రాస్ వారిచే సంయుక్తంగా టైలరింగ్, ఆర్య వర్క్‌లో శిక్షణకేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు. మహిళలు టైలరింగ్, ఆర్య వర్క్‌లో మంచి శిక్షణ పొందిన తర్వాత ఆర్థికంగా ఎదగడానికి దోహదపడాలన్నారు. ఈ రెండు వృత్తులను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. శిక్షణ తర్వాత సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు ఎన్ భాస్కరన్, కో ఆర్డినేటర్లు హరి, లోకనాథం, లిటిల్ ఫ్లవర్ స్కూల్ హెడమాస్టర్ రమేష్, బోధకురాలు మాలినిదేవి, దేవకి, మహిళలు పాల్గొన్నారు.

## తాత్కాలిక న్యాయవిధుల బహిష్కరణ

పుత్తూరు రూరల్, జూన్ 30 ప్రభాతవార్త: న్యాయవాదులపై దాడులను ఖండిస్తూసోమవారం పుత్తూరు బార్ అసోసియేషన్ తాత్కాలిక న్యాయవిధుల బహిష్కరణ తీర్మానంను పుత్తూరు బార్ అసోసియేషన్ కార్య నిర్వాహక సంఘం అధ్యక్షుడు గాలి సురేష్ ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. అత్యవసర సమావేశంలో కోర్టు పనులను తాత్కాలికంగా బహిష్కరించాలని ప్రముఖ న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవివర్మ, మాడా శ్రీనివాసులు, రాజేష్, దినకర్, దొరబాబు, నాధముని, భాస్కర్‌రావు, సాయి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పెంజల్ తుఫాన్ నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించండి

పెళ్లకూరు జూన్ 30 ప్రభాతవార్త : భారతీయ కిసాన్ సంఘ్ వారి ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలం నాయకులు లొక్కు ప్రసాద్ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి తిరుపతి జిల్లా అధ్యక్షులు ఇండ్ల శశికిరణ్ జిల్లా సహకార లొక్కు చెంచు కృష్ణయ్యలతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. గ్రీవెన్స్ డే లో 2024 నవంబర్ డిసెంబర్ నెలలో సంభవించిన పెంజల్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వ్యవసాయ అధికారి వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. దీంతోపాటు ఎరువుల కొరతపై కూడా అధికారులతో చర్చించడం జరిగింది. దీనిపై వెంటనే స్పందించిన అధికారులు రైతులకు ఎరువులు విషయంలో ఎలాంటి కొరత లేకుండా చూస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి తుమ్మ తోటి మునేయ్య, నాయుడుపేట మండల ఉపాధ్యక్షుడు మధనం బేటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యానగర్‌లో అగ్ని ప్రమాదం



కోట, జూన్ 30 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లో సోమవారం లక్ష్మీకాంతమ్మకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే సుమారు లక్ష రూపాయల మేరకు బాధితులకు నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక అధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు.

## 10 గ్రామాలకు మంచినీటి సరఫరా బంద్

కోట, జూన్ 30 ప్రభాతవార్త : మండలం గూడలి వద్ద స్వర్ణముఖి నది నుంచి శుద్ధి జలాలను పది గ్రామాలకు పైపులైన్ల ద్వారా సరఫరా జరుగుతుంది. ఈ క్రమంలో హెచ్‌టి ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పది గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ ఇఇ నందకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ అరవింద్ సంఘటన స్థలానికి చేరుకుని చర్యలు చేపట్టారు. మరో మూడురోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఈలోగా ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని వారు కోరారు. లోకల్ స్కీముల ద్వారా మంచినీటిని ఆయా గ్రామాల పంచాయతీల కార్యదర్శులు సరఫరా చేయాలని సూచించారు.

## సూళ్లూరుపేట తహశీల్దార్‌గా గోపీనాథరెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 30 ప్రభాతవార్త : నూతన తహశీల్దార్ పెళ్లూరు గోపీనాథరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్‌గా ఉన్న ఆయన ప్రస్తుతం బదిలీల్లో భాగంగా సూళ్లూరుపేట తహశీల్దార్‌గా నియమితులయ్యారు. జిల్లా రెవెన్యూ సంఘం అధ్యక్షులుగా, జేఏసీ అధ్యక్షులుగా సేవలందిస్తున్న గోపీనాథరెడ్డి ప్రస్తుతం సూళ్లూరుపేట తహశీల్దార్‌గా రావడం పట్ల రెవెన్యూ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సుంకర నరసింహారావు బదిలీపై వెంకటగిరికి వెళ్లారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు



సూళ్లూరుపేట, జూన్ 30 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరాల్లో 10వ తరగతి ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను సోమవారం అందజేశారు. సూళ్లూరుపేట బాలికోన్నత పాఠశాలలో 28 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇద్దరు, మంగళంపాడు ఉన్నత పాఠశాలలో ముగ్గురు, కోటపోలూరు ఉన్నత పాఠశాలలో నలుగురు చొప్పున మొత్తం 37 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వీరికి మండలంలో ప్రథమస్థానం పొందిన విద్యార్థికి రూ.5,116, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.4,116, హైస్కూల్‌లో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు రూ.3,116, మిగిలిన విద్యార్థులకు రూ.1,116 చొప్పున నగదు అందజేస్తూ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.మృదుల, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేయండి : మాజీ మంత్రి



సూళ్లూరుపేట, జూన్ 30 ప్రభాతవార్త: తిరుపతిలో జులై 6వ తేదీన నిర్వహిస్తున్న బిసి ఆత్మగౌరవ భరోసా సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, అంబేద్కర్ పూలే ఫౌండేషన్ ఛైర్మన్ పరసా రత్నం కోరారు. సోమవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రప్రథమంగా బిసిలు, ఎస్సీలు, అన్ని కులాల వారు కలిసి ఎపిఎఫ్ అనే నూతన ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా ప్రజలకు కులాలతో సంబంధం లేకుండా ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఫౌండేషన్‌కు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. ప్రస్తుతం ఈ ఫౌండేషన్ తిరుపతి జిల్లా కేంద్రంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్‌బెన్ రాజు, నాగరాజ గౌడ్, యాదగిరి, సోమశేఖర్, జక్కల బాలయ్య, కొక్కు శంకరయ్య, సుధాకర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి



దొరవారి సత్రం,జూన్ 30 ప్రభాతవార్త: దొరవారి సత్రం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ సమీపంలో శ్రీహరికోట పునరవాసులకు కేటాయించిన ఇంటి స్థలాల కచ్చేలపై దాడి చేసి ఆస్తి నష్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నాయుడుపేట సీఐకి, డివిసత్రం తహశీల్దార్‌కి వినతి పత్రాలు అందజేశారు. సోమవారం గ్రీవెన్స్‌లో బాధితులు తమ గోడును తహశీల్దార్ ఎదుట విన్నపించు కున్నారు. 1976లో శ్రీహరికోట పునరావాసులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి 10సెంట్లు ఇంటి స్థలాలను అందజేశారు. అయితే శ్రీహరి కోట కాలనీ వాసులకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆ ఇంటి స్థలాలను కంచెలతో ఏర్పాటు చేసుకున్నారు. గత 15 ఏళ్ల నుండి ఇంటి పనులను కొద్ది కొద్దిగా నిర్మించుకుం టున్నారు. అయితే గత కొద్ది రోజులు నుండి చోటా షాడో నాయకులు శ్రీహరి కోట కాలనీవాసుల ఇంటి ఆస్తులపై దాడి చేసి ధ్వంసం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకనైనా మా ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని రెవిన్యూ పోలీసులను కోరారు.

## ఆదుమరిస్తే అంతే సంగతులు



నాయుడుపేట, జూన్ 30 ప్రభాతవార్త: పట్టణంలోని బాలాజిగార్డెన్‌కి వెళ్ళే రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం పడివుండటంతో ఆదుమరిస్తే అంతే సంగతులు అన్నట్లుగా ఉండటంతో ప్రయాణికులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. నాయుడుపేట పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈప్రాంత ప్రజలు మేనకూరు సేజ్‌లలో పనిచేసేందుకు ఈమార్గం గుండా అధిక సంఖ్యలో కాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో పెద్ద రంధ్రం పడివుండటంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఈవిషయమై స్థానికులు మున్సిపాల్టి అధికారులకు పలు దఫాలుగా ఫిర్యాదు చేసిన వారు మాత్రం పట్టించుకోవడం లేదని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాల్టి కమిషనర్ స్పందించి రోడ్డు శాశ్వత మరామ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎంఈఓ 1గా రవీంద్ర బాబు బాధ్యతలు



గూడూరు, జూన్ 30 ప్రభాతవార్త : పట్టణంలోని మండల విద్య వనరుల కేంద్రంలో గూడూరు ఎంఈఓ1గా రవీంద్ర బాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పెళ్లకూరు ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రధానో పాధ్యాయులుగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు కృషి చేస్తామన్నారు.

## బి.ఎ. విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానం



గూడూరు, జూన్ 30 ప్రభాతవార్త: స్థానిక ఎస్కెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఇటీవల షార్టటర్మ్ ఇంటర్న్షిప్ విజయ వంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు సంబంధిత సర్టిఫికెట్స్ ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివ ప్రసాద్ మాట్లాడుతూ బిఏ విద్యార్థులు రొటీన్‌కి భిన్నంగా ఫైన్ ఆర్ట్స్‌లో ఇంటర్న్షిప్ చేయడం తద్వారా చిత్రలేఖనంలో మెళుకువలు తెలుసుకోవడం వారి సబ్జెక్టులో వివిధ అంశాలను బొమ్మల రూపంలో వ్యక్తపరచడం ఒక కళాత్మక ప్రతిభను పెంపొందించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, ఇంటర్న్షిప్ కోఆర్డినేటర్ డాక్టరు వై. శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ బి. పీర్ కుమార్, డాక్టర్ కోటేశ్వరరావు, కిరణ్మయి, డాక్టర్ శైలజ, డాక్టర్ యూన్సీ వాణి, కృపా కరుణ వాణి, భీమవరపు లక్ష్మి, మైమూన్, రవి రాజు, గోపాల్, జనార్దన్, శైలజ, సుందరమ్మ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దొరవారి సత్రం,జూన్ 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని తల్లంపాడు టోల్ ప్లాజా సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వివరాలు మేరకు అక్కరపాక గ్రామానికి చెందిన శ్రీనివాసులు మోటార్ సైకిల్ వెళుతుండగా అదే మార్గంలో వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన శ్రీనివాసులను చికిత్స నిమిత్తం టోల్ ప్లాజా అంబులెన్స్ లో సూళ్లూరుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు.

# గూడూరు డివిజన్

## విద్యార్థినులకు సామూహిక జన్మదినాలు



గూడూరు, జూన్ 30 ప్రభాతవార్త : శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యామసుందరరావు అలియాస్ మయూరిశ్యామ్ యాదవ్ దాతృత్వంతో ఏపిటిడబ్ల్యూఆర్ మినీ గురుకులం నందు ప్రతీ నెలా క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను 9 మంది విద్యార్థినుల చేత భారీ కేక్‌ను కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ చదువు లేనిదే సమాజంలో గౌరవం లేదని అందుకే చేదువే మనకు ముఖ్యమని అందుకే మీరందరూ ఇప్పటినుంచే ఇష్టపడి చదివి భవిష్యత్తులో మీరందరూ ఉన్నత స్థాయికి రావానికి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మినీ గురుకులం హెడ్ మాస్టర్ మేరీ ప్రియత, ఉపాధ్యాయునులు విద్యార్థునులు పాల్గొన్నారు.

## జెమిని కొత్తపాలెంలో సివిల్ రైట్స్ డే



వాకాడు, జూన్ 30 ప్రభాతవార్త : మండలం జెమిని కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని గిరిజన వాడలో సోమవారం తాసిల్దార్ రామయ్య ఆధ్వర్యంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర హక్కుల గురించి మాట్లాడారు, ప్రతి ఒక్కరు ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు, ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ సమానత్వం స్వేచ్ఛ, పౌర హక్కుల గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఏవో దీప, పిఆర్ఏఈ కిరణ్, ఏపీవో విజయ, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి ఘన సత్కారం

దొరవారి సత్రం, జూన్ 30 ప్రభాతవార్త: మండల పరిధిలోని మండల సర్వసభ్య సమావేశంలో సోమవారం శ్రీధనమల్లి పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాదర్ మస్తాన్‌కు ఘనంగా సత్కారం చేశారు. పంచాయతీ కార్యదర్శి పదవి విరమణ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా కుటుంబ సభ్యులకు సెల్వాలు కప్పి పుష్పాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, మధు రెడ్డి, మాజీ సర్పంచులు శ్రీనివాసులు, పురుషోత్తం, పలువురు నాయకులు, అధికారులుపాల్గొన్నారు.

## పౌష్టికరఆహారంతోనే ఆరోగ్యంగా ఉంటారు



బాలాయపల్లి, జూన్ 30 ప్రభాతవార్త :విద్యార్థులు పౌష్టికరమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రత్నమ్మ తెలిపారు. మండలం వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లికి వందనం పథకంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ డి.రత్నమ్మ, వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు, బరువు, ఎత్తు, చెవి, ముక్కు, మానసిక ఇంకా పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. విద్యార్థుల సమగ్ర ప్రగతి ప్రశంస పత్రలు ఇస్తామన్నారు. ప్రభుత్వం జులై 10న తల్లికి వందనం పథకం కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ కరుణకుమారి తెలిపారు. ఈ ఆరోగ్య పరీక్షలులో ప్రిన్సిపాల్ కరుణ కుమారి, అధ్యాపకులు మల్లీశ్వరి, మునీంద్ర వైద్య సిబ్బంది లు పాల్గొన్నారు.

## పరిశుభ్రతోనే ఆరోగ్యంగా ఉంటారు: ఎంపీడీవో



వెంకటగిరి, జూన్ 30 ప్రభాతవార్త: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఐ.వి.ఆర్.స్ గ్రామాలైన పెట్లూరు, పంజాం, మొగల్లగుంట, కలపాడు, అమ్మపాలెం గ్రామాలలో పర్యటించి గ్రామ సర్పంచి చల్లో సలహాలు ఇచ్చారు. వీధుల్లో ఎవరో చెత్తాచెదాన్ని వేయరాదని సూచించారు. తడి పోడి చెత్తను వేరువేరుగా పంచాయతీ సిబ్బందికి అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.వి రమణయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో మన్ననలు పొందిన అధికారులు : ఎంపీపీ



వెంకటగిరి, జూన్ 30 ప్రభాతవార్త: విధి నిర్వహణలో తహశీల్దార్ రాంబాబు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పిఆర్ఏ కమలా విష్ణులు అందరి మన్ననాలు పొందారని ఎంపీపీ తనుజారెడ్డి తెలిపారు. పదవి విరమణ చేస్తున్న సందర్భంగా తహశీల్దార్, ఎంఈఓ, ఏఈలను ఘనంగా సత్కరించారు. ఎంఈఓ, పిఆర్ఏఈ కూడా విధులను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ శంషాద్ బేగం, పిఆర్‌డి ఈ లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు తదితర శాఖల అధికారులు, టిడిపి నాయకులు శివారెడ్డి, చిన్నారెడ్డి, తోట రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## నివేశ స్థలాలను పంపిణీ చేయాలి



వాకాడు, జూన్ 30 ప్రభాతవార్త: ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో దళితులు తహశీల్దార్ రామయ్యకు వినతి పత్రం అందజేశారు. దళితులు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు, దళితుల వివరాలు మేరకు వాకాడు మండలం ముట్టెంబాక పంచాయతీ పరిధిలోని దుర్గవరం గ్రామంలోని సర్వే నంబర్ 30లో అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి 2 ఎకరాల 82 సెంట్లు భూమిలో దళితులకు ఇంటి నివాస స్థలాలు పట్టాలు పంపిణీ చేశారు. ఇప్పటికైనా ఈ సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు.

## కోట టిడిపి పగ్గాలు పలగాటికే



కోట, జూన్ 30 ప్రభాతవార్త : మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష పదవికి కొక్కుపాడు గ్రామానికి చెందిన రాష్ట్ర రైతు కార్యదర్శి పలగాటి భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు గూడూరు నియోజకవర్గం పరిశీలకులు శివకోటారెడ్డి ప్రకటించారు. ఆ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం కోట మండల తెలుగుదేశం పార్టీ నాయకుల సమీక్ష సమావేశంలో పరిశీలకులు శివకోటారెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అధ్యక్ష పదవికి జిల్లా టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్‌తో పాటు తీగల సురేష్‌బాబు, పాదర్తి కోటేశ్వరరెడ్డి పోటీపడ్డారు. దీంతో కొన్నిరోజులుగా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ కొనసాగింది. ఈ నేపథ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకున్న పరిశీలకులు శివకోటారెడ్డి.. పలగాటి భాస్కర్‌రెడ్డికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. గతంలో కూడా భాస్కర్‌రెడ్డి సోదరుడు, దివంగత నేత పలగాటి శ్యామసుందర్‌రెడ్డి కోట మండల అధ్యక్ష పదవిలో సుదీర్ఘకాలం పనిచేశారు. ప్రస్తుతం ఆయన సోదరుడికి ఈ పదవి దక్కడం పట్ల మండలంలోని నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డికి ఈ పదవి రావడం సముచితమని కార్యకర్తలు అంటున్నారు.

## ఉపాధి హామీ కూలీల నిరసన



కోట, జూన్ 30 ప్రభాతవార్త: మండల పరిషత్ కార్యాలయం ఎదుట గూడలి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం కూలీలు నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు కార్యాలయంలో ఎపిఓ పూర్ణిమను నిలదీశారు. తమకు పనికి తగ్గట్టుగా కూలీ రేట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. తాము కష్టపడి పనిచేసినా కొలతల్లో తేడాలు చూపుతున్నారని చెప్పారు. ఈ విషయంపై ఎపిఎం పూర్ణిమ మాట్లాడుతూ తానే గ్రామానికి వచ్చి పని చేస్తున్న ప్రాంతంలో కొలతలు తీస్తానని చెప్పారు.

## అగ్ని బాధితులకి ఆర్థిక సహాయం

బాలాయపల్లి, జూన్ 30 ప్రభాతవార్త : కోనగుంట గ్రామానికి చెందిన మేకల అంకయ్య ఇల్లు అగ్నిప్రమాదం వలన పూర్తిగా కాలిపోయి పోవడంతో తాసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో వినీల్ కుమార్ ఆర్థిక సహాయం అందజేశారు. 5000 రూపాయలు నగదు, నిత్యవసర సరుకులను కుటుంబానికి పంపిణీ చేశారు. వారిని పూర్తిగా ఆదుకుంటామని తెలిపారు.

## సీల్స్ డేపై అవగాహన కల్పించిన ఎస్సై

బాలాయపల్లి, జూన్ 30, ప్రభాతవార్త : సుబ్రహ్మణ్యం గ్రామంలోని గిరిజన వాడలో సివిల్ డే సందర్భంగా గ్రామస్తులకు ఎస్ఐ కామినేని గోపి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పౌరుహక్కులను తెలుసుకోవాలని సూచించారు. హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా పలు సూచనలు సలహాలు ఇచ్చారు సమావేశంలో సర్పంచి కస్తూరి కృష్ణమ్మ, డిప్యూటీ ఎంపీడీవో మోహన్ రాజు, హెచ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి తమ జీవితాలను ఉన్నత స్థాయికి చేరుకోవాలి





గూడూరు, జూన్ 30 ప్రభాతవార్త: ప్రతి విద్యార్థి తమ జీవితాలను ఉన్నత స్థాయికి చేరుకోవడానికి లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసరావు నాయుడు తెలియజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి, 500 పైగా మార్కులు సాధించిన మండలంలోని 27మంది విద్యార్థులకు నగదుతో పాటు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు. మండలంలో 500 పైగా మార్కులు సాధించిన 27 మంది విద్యార్థిని, విద్యార్థులకు మొదటి బహుమతిగా 584 మార్కులు సాధించిన నెలబల్లి రెట్టుపల్లి హైస్కూల్ విద్యార్థి ఎం.శేఖర్‌కు 20వేల రూపాయలు, రెండవ బహుమతిగా 573 మార్కులు సాధించిన వరగలి హై స్కూల్‌కు చెందిన పి.పురుషోత్తంకు పదివేల రూపాయలను, మూడవ బహుమతిగా 565 మార్కులు సాధించిన ఎన్ఆర్‌పల్లి హైస్కూల్ కు చెందిన పి.నవీన్ కుమార్ పదివేల రూపాయలను, అలాగే మిగిలిన విద్యార్థుల ఒక్కొక్కరికి 5000 రూపాయల వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ విద్యాశాఖ అధికారి అబ్దుల్ హమీద్, ట్రస్ట్ కార్యదర్శి రామయ్య నాయుడు, తిక్కవరం, చింతవరం, తడివేడు, రెట్టపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పి.రమణయ్య, శివ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, విజయలక్ష్మి, చంద్రశేఖర్, పివి కృష్ణారెడ్డి, ప్రజేంద్రరెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

## లౌడ్ స్పీకర్లు పై ఆటో డ్రైవర్‌లకు అవగాహన

గూడూరు, జూన్ 30 ప్రభాతవార్త : గూడూరు 1వ పట్టణ సిఐ, ఎస్ఐలు గూడూరు పట్టణంలో ఆటోలకు లౌడ్ స్పీకర్లు పెట్టుకొని ఎక్కువ శబ్దం చేసే ఆటోలకు లౌడ్ స్పీకర్లు తీపించే కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలో లౌడ్ స్పీకర్లు పెట్టుకొని నడుపుతున్న 9 ఆటోలకు 9 లౌడ్ స్పీకర్లును తొలగించి సదరు ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## పౌర హక్కులపై అవగాహన కల్గి ఉండాలి



చిల్లకూరు, జూన్ 30 ప్రభాతవార్త : చిల్లకూరులోని శంకర గిరిజన కాలనీలో సోమవారం సాయంత్రం తాసిల్దార్ శ్రీనివాసులు అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పౌరహక్కులపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఇల్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఆధార్ కార్డులు లేనివారికి ఆధార్లను అందించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ తమ పిల్లల్ని చక్కగా చదివించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ పూర్ణ, మాజీ సర్పంచ్ నెల్లూరు రామ్మూర్తి,హౌసింగ్ ఏఈ షబ్బీర్,సోషల్ వెల్ఫేర్ పద్మజ, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ లైన్ మెన్ మల్లికార్జున, హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా వికాస్ కేంద్రానికి రూ.1.53 కోట్లు

### పునఃనిర్మాణానికి ఎంఎల్ఏతో శాప్ చైర్మన్ పూజలు



చంద్రగిరి, జూన్ 30 ప్రభాతవార్త: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 5 ఏళ్ళ పాలనలో నిర్లక్ష్యానికి గురైన క్రీడా వికాస్ కేంద్రం కూటమి ప్రభుత్వ లక్ష్యం అయినట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా వికాస్ (ఇండోర్ స్టేడియం) పునఃనిర్మాణ పనులను సోమవారం ఎంఎల్ఏ, శాప్ చైర్మన్ సంయుక్తంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవి నాయుడు మాట్లాడుతూ క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు వారి ఉద్యోగ నియామకాలలో రిటన్ టెస్టలు లేకుండా నేరుగా ఎంపిక చేసే విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు వివరించారు. దేశంలో ఇటువంటి విధానం మరెక్కడా లేదన్నారు. 2014-2019 మధ్య కాలంలో నాటి టిడిపి ప్రభుత్వం 2017లో చేపట్టిన క్రీడా వికాస్ (ఇండోర్ స్టేడియం) నిర్మాణ పనులను 2019-2024 మధ్య కాలంలో అధికారం చేపట్టిన వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రక్కన పెట్టినట్లు దుయ్యబట్టారు. అయితే ఎంఎల్ఏ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళడంతో తాము కోరిన వెంటనే క్రీడా వికాస్ కేంద్రానికి రూ.1.53 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. సరిగ్గా మూడు నెలల్లోనే ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా క్రీడాకారులు ఈ క్రాడా వికాస్ స్టేడియంను సద్వినియోగం చేసుకుని చంద్రగిరికి తగిన గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఎల్ఏ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఇప్పటివరకు ప్రజలకు అవసరమైన 937 అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలను పెంపొందించుకునేందుకు ఈ ఇండోర్ స్టేడియం చక్కగా దోహదపడగలదన్నారు. ముఖ్యంగా చంద్రగిరిలో గోవిందధామం (కైలాష్‌ధామం) నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నట్లు తెలిపారు. ఇందుకు ఆర్థికంగా సహాయపడటంలో దాతలు ముందుకురావాలన్నారు. త్వరలోనే చంద్రగిరి రోడ్డు విస్తరణ పనులు సైతం చేపడతామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ రజిని, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్‌చే తనిఖీలు

కుప్పం /రామకుప్పం, జూన్ 30 ప్రభాతవార్త బి రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ సోమవారం విజలాపురం పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో ఏర్పాటుచేసిన డిజిటల్ నెర్వ్ సెంటర్ పనితీరును పరిశీలించారు. దీని ద్వారా ప్రజలకు అందే వైద్య సౌకర్యాలు పరిశీలించారు. ప్రజలు ఐడి క్రియేట్ చేయించుకుని నాణ్యమైన వైద్య సేవలు పొందేలా చూడాలని ఆయన ఆదేశించారు. దీర్ఘకాలిక వ్యాధులు, బిపి, చక్కెర వ్యాధి, గుండె జబ్బులు, కేన్సర్, థైరాయిడ్ వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాధి నిరోధక టీకాల అధికారి డా॥ దేవి, డిఎంహెచ్ఓ సుధారాణి, డిఅండ్‌సి ఐటి మేనేజర్, డిసిహెచ్ఎస్ డా॥ పద్మాంజలి, డా॥ పూజిత పాల్గొన్నారు. అనంతరం కుప్పం ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటైన డిఐఎన్‌సి సెంటర్‌ను పరిశీలించారు. ఇక్కడ నుంచి పిహెచ్‌సిల అనుసంధానం గురించి అడిగి తెలుసుకున్నారు.

## గణనాధుని సేవలో మంత్రి కొల్లు రవీంద్ర



కాణిపాకం, జూన్ 30 ప్రభాతవార్త: రాష్ట్ర ఎక్సైజ్ మరియు మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఆలయ సూపరెంటెంట్ కోదండపాణి, ఐరాల తహశీల్దార్ లోకేశ్వరి, చిత్తూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ షణ్ముగం, స్థానిక మాజీ సర్పంచ్ మదుసూధన్‌రావు, చిత్తూరు ఎక్సైజ్, మైనింగ్ శాఖల అధికారులు స్థానిక టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పల్మనాలజిస్టుగా సూర్యప్రకాష్ ఎంపిక



తిరుపతి హెల్త్, జూన్ 30 ప్రభాతవార్త: దేశంలో జరిగిన ఉత్తమ పల్మనాలజిస్టు ఎంపికలో తిరుపతిలో ఎంతో ప్రసిద్ధి చెందిన శ్వాసకోస వ్యాధి నిపుణులు అయిన డాక్టర్ ఎస్. సూర్యప్రకాష్ ఎంపిక అయ్యారు. దీనికి సంబంధించిన అవార్డు ప్రధానోత్సవం ఢిల్లీలో ఇటీవల జరిగింది. దీనికి సంబంధించిన అవార్డును మంత్రి సత్యకుమార్ యాదవ్ నుంచి డాక్టర్ సూర్యప్రకాష్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సిక్కిం గవర్నర్ ఓం ప్రకాష్, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కవారియా, మాజీ పార్లమెంటు సభ్యులు జయ ప్రద, తదితరులు పాల్గొన్నారు.


**CHANGE OF NAME**

I, **KAGGALA DAMU**, (Old Name) S/o KAGGALA VEERA BHADRAIAH, R/at D.No.20-50-S2- C320/16, Maruthi Nagar, Korlagunta, Tirupati Dist. A.P. I have changed my name to **KAGGALU DHAMU**. Henceforth I will be known as **KAGGALU DHAMU** (New Name).

I, **BHOJANPU SREEKANTH** , (Old Name) S/o BHOJANAPU SHADEVA, R/at DNo: 4-21, Thippigaripalli, Kona (V), Kalakada (M), Annamayya Dist. A.P. I have changed my name to **BHOJANAPU SREEKANTH.** Henceforth I will be known as **BHOJANAPU SREEKANTH** (New Name).